క్లుప్తంగా

మెరుగ్గా మెస్ నిర్వహణ



మెస్‌లో భోజనం చేస్తున్న డైరెక్టర్ బాలాజీ తదితరులు

ఎచ్చెర్ల క్యాంపస్: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం మెస్ నిర్వహణ మెరుగ్గా ఉండాలని, షెడ్యూల్ మేరకు మెనూ నిర్వహించాలని క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ అన్నారు. చిలకపాలెంలోని అద్దె క్యాంపస్‌లో నడుస్తున్న మెస్‌ను శుక్రవారం రాత్రి ఆకస్మికంగా పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులతో మాట్లాడి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వస్తే వెంటనే స్పందించాలని మెస్ కమిటీకి సూచించారు. ఆయన వెంట పరిపాలన అధికారి ముని రామకృష్ణ, ఇతర అధికారులు ఉన్నారు.

హేమశ్రీకి అభినందనలు



హేమశ్రీని అభినందిస్తున్న కరస్పాండెంట్, అధ్యాపకులు

శ్రీకాకుళం కల్చరల్: విద్యాధరి డిగ్రీ కళాశాలలో బీఏ సెకెండియర్ చదువుతున్న దూబ హేమశ్రీ అనకాపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విజేతగా నిలిచి స్వర్ణ, రజత పతకాలు సాధించింది. ఈ సందర్భంగా హేమశ్రీని కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ జామి భీమశంకర్, అధ్యాపకులు శుక్రవారం అభినందించారు.

ఆర్టీసీ అభివృద్ధికి కృషి



శ్రీకాకుళం-విజయనగరం ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో శ్రీకాకుళం నుంచి విజయనగరానికి నూతన బస్సు సర్వీసును శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో డీపీటీవో ఎ.విజయ్‌కుమార్, శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు మల్లికార్జునరాజు, కేఆర్ఎస్ శర్మ, అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, అధికారులు ఎల్ఎస్ నాయుడు, ఎండీఏ బాషా, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌సీ ఇండియా అవార్డుకు ఎంపిక



అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని వెంకటేశ్వరా ఇంజినీరింగ్ కాలేజ్ నుంచి కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాం పిటెన్సీస్ ఇండియా (సీఎస్‌సీ ఇండియా) ఎక్సలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్ -2024 అవార్డులకు మెకానికల్ ఇంజినీరింగ్ హెడ్ ఆఫ్ దా డిపార్టమెంట్ డాక్టర్ జె.బాలభాస్కర్, మేనేజ్‌మెంట్‌స్టడీస్ (ఎంబీఏ) హెడ్ ఆఫ్ దా డిపార్టమెంట్ డాక్టర్ కె.సత్యం ఎంపికయ్యారు. వర్చువల్‌గా ఢిల్లీకి చెందిన ఈ సంస్థ శుక్రవారం కార్యక్రమం నిర్వహించి ఎంపికైన వారి పేర్లు ప్రకటించింది. బోధన రంగంలో వీరు చేసిన కృషిని వివరించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ ఎస్‌సీవీ రమణ మూర్తి నాయుడు ఆధ్వర్యంలో ఫ్యాకల్టీ సభ్యులు ఫ్యాకల్టీ సభ్యులను సత్కరించి అభినందించారు.

కమిషనర్‌ను కలిసిన కో ఆర్డినేటర్లు



కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కోఆర్డినేటర్లు

శ్రీకాకుళం: నగర కార్పొరేషన్ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన పి.వి.వి.డి.ప్రసాదరావును ఏపీ ఎన్‌జీసీ జిల్లా కో-ఆర్డినేటర్ పూజారి గోవిందరావు, క్లస్టర్ కో-ఆర్డినేటర్ జి.మోషేలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నాగావళి నదిలో కాలుష్య నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని వినతిపత్రం అందించారు. సమస్యలపై కమిషనర్ సానుకూలంగా స్పందించారు.



శ్రీకాకుళం కల్చరల్: విజయగణపతి ఆలయం వద్ద మట్టి వినాయకుల పంపిణీ



శ్రీకాకుళం కల్చరల్: ఆశాదీపిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినాయక విగ్రహాల పంపిణీ



శ్రీకాకుళం కల్చరల్: జూట్స్ స్కూల్ విద్యార్థులు తయారు చేసిన విగ్రహాలు



శ్రీకాకుళం అర్బన్: మట్టివినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న సూర శ్రీనివాసరావు



రణస్థలం: మట్టి విగ్రహాలను పూజించాలని ర్యాలీ నిర్వహిస్తున్న సూర్య స్కూల్ విద్యార్థులు

చవితి ఉత్సవాలకు సిద్ధం

- ముస్తాబైన గణపతి ఆలయాలు
- నేటి నుంచి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



పాలకొండ రోడ్డులోని విజయగణపతి ఆలయం



ఎచ్చెర్ల: లావేరు మండలం బుడుమూరు పాఠశాలలో మట్టి వినాయక ప్రతిమలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

శ్రీకాకుళం కల్చరల్ : వినాయక చవితి ఉత్సవాలకు వేళయ్యింది. శనివారం నుంచి నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు పల్లె పట్టణాలు సిద్ధమయ్యాయి. గ్రామాల్లో వీధికొక మండపాలను యువత సిద్ధం చేస్తుండగా..గణనాథుని ఆలయాలు సైతం విద్యుద్దీపాలంకరణలతో ముస్తాబయ్యాయి. తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్సవాల కోసం ఆలయ కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

- పట్టణంలోని పాలకొండ రోడ్డులోని ఇన్‌కం టాక్సు కార్యాలయం వద్ద విజయగణపతి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్‌కుమార్‌శర్మల ఆధ్వర్యంలో ఇక్కడ ప్రతి మంగళవారం భక్తులు ఇచ్చిన 300లీటర్ల పాలతో క్షీరాభిషేకాలు నిర్వహిస్తున్నారు. నవరాత్రుల సమయంలో ప్రతిరోజూ రాత్రి విశేష హారతులు, పుష్పాభిషేకాలు, తిరువీధి మహోత్సవాలు జరుగుతాయి.
- మొండేటి వీధిలోని లక్ష్మీగణపతి ఆలయం వద్ద నవరాత్రి ఉత్సవాలలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, నైవేద్యాలు, పూజలు చేస్తారు. షిరిడిసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో ఇక్కడ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు.
- మంగువారితోటలోని సంపత్ వినాయకుని ఆలయంలో దక్షిణామూర్తి పూజలు, కలాల పూజలు, విశేష పూజలు నిర్వహిస్తారు. పీఎన్ కాలనీలోని వరసిద్ధి వినాయక దేవాలయంలో సిద్ధిబుద్ధి సమేత గణపతి వద్ద ప్రత్యేక పూజలు, వ్రతాలు ఆచరిస్తారు. విశాఖ ఏ కాలనీలోని సంపత్ వినాయక ఆలయం, నాగావళి నదీ తీరాన చిం దత్తనాధ క్షేత్రంలోని గణపతి ఆలయాలు సైతం వేడుకలకు సిద్ధమయ్యాయి..

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

శ్రీకాకుళం కల్చరల్/శ్రీకాకుళం రూరల్: నగరంలోని పలుచోట్ల స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఆలయాల ఆధ్వర్యంలో శుక్రవారం వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. పాతశ్రీకాకుళంలోని సంతోషిమాత దేవాలయంలో ఆలయ అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు. పాలకొండ రోడ్డులోని విజయగణపతి ఆలయం వద్ద ఆలయ కమిటీ, అర్చకుల ఆధ్వర్యంలో, రైతుబజారు కూడలి వద్ద లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, విశాఖ-బీ కాలనీలోని ఎస్.టి.జూట్స్ స్కూల్ వద్ద ఈశ్వర్ ఆర్ట్స్ అండ్ డిజిటల్స్ ఆధ్వర్యంలోనూ, ఆశాదీపిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను వితరణ చేశారు.



రణస్థలం: వెంకటేశ్వర కాలనీలో సిద్ధమౌతున్న గణపతి మండపం



ఎచ్చెర్ల క్యాంపస్:చిలకపాలెంలో సిద్ధం చేసిన మండపం



జి.సిగడాం: నక్కపేట పాఠశాలలో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు



రణస్థలంలో మార్కెట్ సందడి



రణస్థలం: జె.ఆర్.పురంలో మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు



శ్రీకాకుళం రూరల్: నైరాలో విగ్రహాలను అందజేస్తున్న నవతా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి పి.వి.ఎస్.ఎన్.మూర్తి, సర్పంచ్ రామ్‌ప్రతాప్



ఎచ్చెర్ల క్యాంపస్: అల్లినగరంలో మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న హెచ్ఎస్ఆర్ ట్రస్ట్ సభ్యులు



ఎచ్చెర్ల క్యాంపస్: కేశవరావుపేటలో మట్టి విగ్రహాలు పంపిణీ



జి.సిగడాం: మార్కెట్‌లో పండ్లు అమ్ముతున్న దృశ్యం

అథ్లెటిక్స్ మీట్‌కు సర్వం సిద్ధం

శ్రీకాకుళం న్యూకాలనీ: కొన్న చిన్నారావు అథ్లెటిక్స్ పోటీలకు రంగం సిద్ధమైంది. ఏటా జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కొన్న చిన్నారావు మెమోరియల్ జిల్లాస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం జరగనున్న నేపథ్యంలో మీట్ నిర్వాహకుడు కొన్న వెంకటేశ్వరరావు (వాసు) నేతృత్వంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా పోటీలను నిర్వహిస్తున్నారు. 16 ఏళ్ల నుంచి కొన్న చిన్నారావు కుటుంబ సభ్యులు లక్షలాది రూపాయిలను వెచ్చించి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఏఆ క్రీడాపోటీలను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తున్నారు. వివరాలకు జిల్లా అథ్లెటిక్స్ సంఘ ప్రధాన కార్యదర్శి, పీడీ ఎం.సాంబమూర్తి (సెల్: 8500271575)ని సంప్రదించవచ్చు.



పరుగుపందెంలో అథ్లెట్స్ జోరు

కిడ్నీ బాధితుడుకి ఆర్థిక సాయం



వి.వి.ఎన్.కుకేకు సాయాన్ని అందజేస్తున్న ఎస్ఐ చిరంజీవి, సంస్థ సభ్యులు

రణస్థలం: మండలంలోని జె.ఆర్.పురంలో నివాసం ఉంటున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన వి.వి.ఎన్.కుకే కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఇతనికి మేమున్నాం సేవా సంఘం అండగా నిలించింది. రూ. 20 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని జె.ఆర్.పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి చేతుల మీదుగా బాధితుడుకి శుక్రవారం అందజేశారు. 20 ఏళ్ల క్రితం రణస్థలం బతుకు తెరువు కోసం వచ్చి ప్రైవేటు ఉపాధ్యాయుడుగా వి.వి.ఎన్.కుకే పని చేస్తున్నారు. రెండు సంవత్సరాల క్రితం కిడ్నీ వ్యాధి సోకింది. ప్రస్తుతం రెండు కిడ్నీలు పాడైపోయాయి. కుటుంబ పరిస్థితి దయనీయంగా ఉండటంతో మేమున్నాం సేవా సంస్థ తనవంతు సాయం అందించింది. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పచ్చిగుళ్ల సాయిరాం, యువ టీం అంజిబాబు, ఎస్.కళావెంకటరావు, మేమున్నాం సభ్యులు చంద్రశేఖర్, ఎస్.ఆనందం, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ (పురుషుల) కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ బోధనకు మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో కనీసం 55 శాతం మార్కులు కలిగి ఉండి నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హత కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యమిస్తామని చెప్పారు. ఆసక్తి గల వారు ఈ నెల 10న ఉదయం 10 గంటలకు కాలేజీలోని కెమిస్ట్రీ విభాగంలో హాజరుకావాలని సూచించారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యం



యూనియన్ బ్యాంక్ బ్రాంచిని ప్రారంభిస్తున్న శంకరరావు

శ్రీకాకుళం అర్బన్: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే యూనియన్ బ్యాంక్ లక్ష్యమని విశాఖపట్నం డిప్యూటీ జోనల్ హెడ్ శంకరరావు అన్నారు. శ్రీకాకుళంలోని డే అండ్ నైట్ కూడలి వద్ద యూనియన్ బ్యాంకును నగరంలోని రామకృష్ణ థియేటర్ సందులోని కిల్లానా కాంప్లెక్స్‌లోకి మార్పు చేసి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ జోనల్‌హెడ్ శంకరరావు మరియు రీజనల్ హెడ్ తిలక్, డిప్యూటీ రీజినల్ హెడ్స్ రవి, శుభ్ నారాయణ, బ్రాంచ్ మేనేజర్ రామచంద్ర బెహరా, ఆఫీసర్ సంఘ నాయకులు కేతేశ్వరరావు, అవార్డు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బి శ్రీనివాసులు, బ్రాంచ్ మేనేజర్లు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



ఎచ్చెర్ల: సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల: లావేరు మండలం కొత్తకోట పంచాయతీ సర్పంచ్ శాంతాటి భాస్కరరావు తండ్రి రమణయ్య అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ భాస్కరావు కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించి సంతాపాన్ని తెలియజేశారు. పరామర్శ పార్టీ నాయకులు రొక్కం బాలకృష్ణ, లుట్ట యల్లయ్య, గుమ్మడి దుర్గారావు, మేడబోయిన శ్రీనివాసరావు, గొర్లె ప్రభాకర్, గంట్యాడ సత్యం, మహంతి సత్యన్నారాయణ, లింగాల రామప్పడు, శ్రీనివాసరావు, ధర్మారావు, రాహుల్, భూషణ్ ఉన్నారు.

జి.సిగడాం: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నాయిని లక్ష్మణరెడ్డి తల్లి అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో అతని కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పరామర్శించి సంతాపాన్ని తెలియజేశారు. మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, మండల బూత్ కన్వీనర్ ఆబోతుల జగన్నాథం, మాజీ సర్పంచులు నాయిని సింహాచలం, వెలిది సాయిరాం, మహదాస్యం నారాయణరావు, ఎంపీటీసీ సభ్యుడు కీర్తి సత్యంనాయడు, పిన్నింటి రామినాయుడు, మజ్జి రమణ ఉన్నారు.

సంక్షిప్తంగా..

ఇంటింటా సభ్యత్వ నమోదు

శ్రీకాకుళం : రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికి వెళ్లి బీజేపీ సభ్యత్వాలు నమోదు చేస్తున్నామని పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నా దయాకర్ అన్నారు. శుక్రవారం శ్రీకాకుళం పట్టణంలో పార్టీ సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు.

హిందీ మంచ్ 'సులేఖన్' పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ హిందీ పక్షోత్సవాలను పురస్కరించుకుని హిందీ మంచ్ సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాకుళం డివిజన్ స్థాయిలో హైస్కూల్ విద్యార్థులకు హిందీ సులేఖన్ (దస్తూరి) పోటీలు నిర్వహించనున్నట్టు హిందీ దివస్ కార్యక్రమ సమితి అధ్యక్షుడు సురంగి మోహనరావు, హిందీ మంచ్ ప్రతినిధులు దొంతం పార్వతీశం, సూరంపల్లి బ్రహ్మాజీ, కోనే శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు పోటీలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. 'సారే జహాసే అచ్ఛా....' హిందీ దేశభక్తి గీతాన్ని హిందీలో చేతిరాతతో తెల్ల కాగితంపై రాసి ఈ నెల 12లోగా గూనపాలెంలోని శాంతినికేతన్ జూనియర్ కాలేజీకి పంపించాలని సూచించారు. వివరాలకు 92913 27150, 98497 70713 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

స్వయం సహాయ సంఘం ఆడిట్ చేయాలి

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రతి స్వయం సహాయ సంఘం ఆడిట్ చేయాలని ఎచ్చెర్ల పేదరిక నిర్మూలన సంస్థ ఏరియా కోఆర్డినేటర్ రవికుమార్ అన్నారు. ఎచ్చెర్ల క్లస్టర్ సీఎఫ్‌లకు ఎచ్చెర్ల సాంకేతిక శిక్షణ కేంద్రంలో ఆడిట్‌పై శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లో ఆడిట్ ఉంటుందని చెప్పారు. ప్రతి స్వయం సహాయ సంఘం చేస్తున్న పొదుపు, తీసుకుంటున్న రుణాలు, చెల్లిస్తున్న మొత్తం, పొందుతున్న ప్రయోజనాలపై ఆడిట్ ఉంటుందని వివరించారు. స్వయం సహాయ సంఘాలు పారదర్శకంగా ముందుకు సాగటం, తీసుకున్న రుణాలు సద్వినియోగం చేసుకోవడం కీలకమన్నారు. అకౌంట్స్ సీసీ జనకీరాం పాల్గొన్నారు.

నిమజ్జనంలో జాగ్రత్తలు తప్పనిసరి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వినాయక నిమజ్జనం సందర్భంగా నాగావళి నది వద్ద భద్రతా ప్రమాణాలు పాటించాలని లైఫ్ సేవింగ్ అసోసియేషన్ ఫౌండర్ జాతీయ లైఫ్ సేవింగ్ స్పోర్ట్స్ మెడలిస్ట్ షేక్ సుభాన్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఉమారుద్ర కోటేశ్వరాలయం వద్ద లైఫ్ సేవింగ్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైఫ్ సేవింగ్ టీం ఉండటంతో నాలుగేళ్లుగా ఎటువంటి ప్రమాదాలు జరగలేదన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు 20 మంది సభ్యులు వినాయక నిమజ్జనం సమయంలో పనిచేస్తారని తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ బాలాజీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ నోపాడు రాజారావు, సీనియర్ స్విమ్మింగ్ క్రీడాకారులు సత్తిరాజు సహదేవుడు, పొన్నాడ ప్రసాద్, లైఫ్ సేవర్ రాకోటి కిషోర్, భాను రాజేష్, శ్రీను, అష్రఫ్ అలీ, అనిల్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు రోటరీ అవార్డులు

శ్రీకాకుళం అర్బన్: రోటరీ క్లబ్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు యతిరాజ్యం హేమసుందర్, రోణంకి కరుణ, బోనుల ప్రసాద్, సీహెచ్ ఈశ్వరరావులను రోటరీ నేషన్ బిల్డర్ అవార్డు, ప్రశంసాపత్రం, జ్ఞాపిక, దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు ఎంఆర్‌కే దాస్, బరాటం శ్రీనివాస, కందుల నవీన్‌కుమార్, పసగడ సూర్య, గోవిందాచారి, సాయి సూర్య, ఉదయ్‌కిరణ్, రత్న మహేష్, సాయి హర్ష పాల్గొన్నారు.

ఉపనిషన్మందిరంలో ఆధ్యాత్మిక ప్రవచనం

శ్రీకాకుళం కల్చరల్: భారతీయ సంప్రదాయంలో దేవతారాధన కీలకమని నిష్ఠల నరసింహమూర్తి అన్నారు. నగరంలోని ఉపనిష్మందిరంలో వినాయక చవితి ప్రాముఖ్యతపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. అనంతరం వక్తను మందిరం సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పతంజలి శాస్త్రి, జంధ్యాల శరత్‌బాబు, మోహనరావు, సంగమేశ్వరరావు, పి.తవుడు, ఈశ్వరరావు, వాసు, నారాయణమూర్తి, సరస్వతి పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

జి.సిగడాం: వాండ్రంగి పంచాయతీ చీడిపేట గ్రామంలో శుక్రవారం సాయంత్రం దోమల నివారణ కోసం ఫాగింగ్ చేపట్టారు. స్థానిక సర్పంచ్ సాకేటి నాగరాజు, పంచాయతీ కార్యదర్శి వడగా గౌరీశంకరరావు పర్యవేక్షించారు.

క్యాన్సర్ బాధితునికి సాయం

శ్రీకాకుళం కల్చరల్: క్యాన్సర్‌తో బాధపడుతున్న బలరామపురం గ్రామానికి చెందిన కొమ్మరు శివకు రూ.10 వేలను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ చేతుల మీదుగా అందచేశారు. పిలుపు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలొ సహృదయ ఫౌండేషన్(యుఎస్ఏ) బిందు సహకారంతో ఈ మొత్తాన్ని అందజేసినట్లు చైర్మన్ జి.రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో సాగర జ్యోతి ఫిష్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ సీఈవో రెడ్డి ఆనంద్, అరుణోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు జి.అరుణ్‌కుమార్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి రూ.15వేలు

శ్రీకాకుళం కల్చరల్: విజయవాడ వరద ముంపు బాధితులకు తన వంతుగా రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అదపాక గ్రామం రైతు కిలారి రామకృష్ణ అందజేశారు. డీఎంహెచ్‌వో కార్యాలయం ఉద్యోగి చిరుకూరు వెంకటరావు రూ.5వేలు పంపించారు.

ఫిర్యాదుదారు నుంచి వివరాలు సేకరణ

ఎచ్చెర్ల క్యాంపస్: దుప్పలవలస రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 97/9, 10, 11లో ఉన్న చెరువు గర్భాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించుకున్నారని ఫరీదుపేటకు చెందిన గురుగుబెల్లి మహేశ్వరరావు జిల్లా మీకోసం పబ్లిక్ గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఫిర్యాదుదారు నుంచి రెవెన్యూ పరిశీలకురాలు మధుప్రియ, రెవెన్యూ సిబ్బంది శుక్రవారం వివరాలు సేకరించారు. చెరువు గర్భం ఆక్రమణలు తొలగించాలని ఫిర్యాదుదారుడు కోరారు. ఆధారాలు సమర్పించాలని రెవెన్యూ సిబ్బంది సూచించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: రోడ్డు ప్రమాదంలో మహిళ గాయపడింది. చిలకపాలెం గ్రామానికి చెందిన వచ్చ సూరప్పమ్మ శుక్రవారం కూరగాయలు కొనుక్కొని సర్వీస్ రోడ్డు దాటుతుండగా, విశాఖపట్నం వెళుతున్న కారు వెనుక నుంచి ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. గాయపడిన ఆమెను 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

8న గాత్ర సంగీత విభావరి

శ్రీకాకుళం కల్చరల్ : వినాయక చవితి పురస్కరించుకొని కచ్చపి కళాక్షేత్రం(ఆమదాలవలస) ఆధ్వర్యంలో ఈ నెల 8న సాయంత్రం 6గంటలకు బాపూజీ కళామందిర్‌లో గాత్ర సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు బఖుపల్లి శ్రీరామచంద్రమూర్తి శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నైకి చెందిన ప్రముఖ గాత్ర విద్వాంసులు అభిషేక్ గిరిప్రసాద్, వాయులీనంపై మావుదూరు సత్యనారాయణ శర్మ, మృదంగంపై దుర్గా శ్రీనివాసశర్మ, ఘటంపై మావుదూరు సూర్యప్రసాదరావులతో విభావరి జరుగుతుందని పేర్కొన్నారు. కళాభిమానులంతా హాజరుకావాలని కోరారు.